ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5★
పెద్దపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 29 అక్టోబరు 2024

మంథనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం 8



పోలీస్ కమిషనరేట్‌లో ఓపెన్ హౌస్ 8



అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ బదిలీ

పెద్దపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పని చేస్తున్న జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఆసిఫాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న డి వేణును పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఖాళీగా ఉన్న గోదావరిఖని సింగరేణి భూసేకరణ విభాగం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా దేవరకొండలో ఆర్‌డీఓగా పనిచేస్తున్న బి శ్రీరాములును బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మంథని ఆర్డీవోగా సురేష్

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంథని రెవెన్యూ డివిజనల్ అధికారిగా కాశబోయిన సురేష్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న సురేష్‌ను మంథని ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ పని చేసిన ఆర్డీవో హనుమానాయక్‌ను పలు ఆరోపణల పై కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేయడంతో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య ఇంచార్జి ఆర్డీవోగా పని చేశారు.

'ప్రజావాణి' సమస్యలను పరిష్కరించాలి: కలెక్టర్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీతో కలిసి ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 16 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రామగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) పెద్దపెల్లి జిల్లా కేంద్రంగా రామగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి శ్రీధర్ బాబును కాంగ్రెస్ కౌన్సిలర్లు నూగిళ్ల మల్లయ్య, భూత గడ్డ సంపత్, తాడూరి పుష్పకళా శ్రీమాన్ కలిసి రామగుండం పేరుతో వచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు మార్పు చేయాలని వారు మంత్రి శ్రీధర్ బాబును కోరారు. రామగిరి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏరాటుకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కలెక్టర్‌కు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

● రామగుండం అర్బన్ డెవలపమెంట్ మెంట్ అథారిటీ(రుడా)ను పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా నామకరణం చేయాలని మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్నీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



'రుడా' ఏర్పాటుపై అసంతృప్తి

- 80 శాతానికి పైగా జిల్లాలోని గ్రామాల విలీనం
- స్థానిక సంస్థలకు తగ్గనున్న ఆదాయం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కొత్తగా ఏర్పాటు చేస్తున్న రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ(రుడా)లో జిల్లాలో గల ఒక మున్సిపల్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, 198 గ్రామా లను విలీనం చేయడంపై ఆయా రాజకీయ పార్టీల నాయకులు, వివిధ వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామ గుండం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ అంటే అక్కడి కార్పొరేషన్ వరకే ఉంటుందని మొదట అందరు భావించారు. కానీ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించిన తర్వాత 80 శాతం జిల్లాను రుడా పరిధిలోకి తీసుకు రావడం విమర్శలకు దారితీస్తు న్నది. దీని వల్ల స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అవుతాయని, పన్నుల రూపేణ వచ్చే ఆదాయం అంతా నేరుగా రుడాకే వెలుతుందని, అందులో కొంత మొత్తం మాత్రమే పంచాయతీలకు వస్తుందనే వాదనలు వినబడుతు న్నాయి. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పలు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీల పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ప్రధాన రహదారుల వెంట ఉండే కొన్ని గ్రామాలను మాత్రమే తీసుకు న్నారు. కానీ అవి నామమాత్రంగానే కొనసాగాయి. వాటి ద్వారా పెద్దగా అభివృద్ధి కార్యకలాపాలు జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం పట్టణాలతో పాటు గ్రామాలను కూడా పట్టణీకరణ చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నది. అందులో భాగంగా గతంలో ఏర్పాటు చేసిన అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీల పరిధిని విస్తరించడంతో పాటు, కొత్తగా కొన్ని జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీలను ఏర్పాటు చేసి వాటి పరిధిలోకి మొత్తం మున్సిపాలిటీలతో పాటు 70 నుంచి 80 శాతం వరకు గ్రామాలను అందులో విలీనం చేసి ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. అందులో భాగంగా జిల్లాలో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని పరిధిలో జిల్లాలో గల రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు 198 గ్రామాలను విలీనం చేశారు. దీంతో పెద్దపెద్ద ఇళ్ల నిర్మాణాలు, పరిశ్రమలు, పెద్ద భవనాల నిర్మాణాలకు రుడా ద్వారానే

మిగతా 8వ పేజీలో...

'రుడా' వద్దు.. 'పుడా' ముద్దు..

పెద్దపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసినా కూడా రామగుండం పట్టణానికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పోలీస్ కమిషనరేట్, మెడికల్ కళాశాలను అక్కడనే ఏర్పాటు చేశారని, ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ కూడా అక్కడే ఏర్పాటు చేయడంపై వివిధ పక్షాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రామగుండంకే పరిమితం గాకుండా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, 80 శాతం గ్రామాలకు విస్తరించడంతో రుడా వద్దు పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారాటీ (పుడా) గానీ, రామగిరి అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ అని పేరు పెట్టాలని వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సోమవారం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించేందుకు వచ్చిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పలువురు నాయకులు కలిసి రుడాకు బదులు పుడా గానీ రామగిరి గానీ పేరు మార్చాలని వినతి పత్రం సమర్పించారు. భారతీయ జనతా పార్టీ, బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు అదనపు కలెక్టర్‌ను కలిసి రుడా వద్దు పుడా అని పేరు మార్చాలని వినతిపత్రాలు అందించారు. రుడా పరిధిని తగ్గించి, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయం తగ్గకుండా చూడాలని, ప్రజలపై కూడా పన్నుల భారం పడకుండా చూడాలని, రుడాకు బదులు పుడా ఏర్పాటు చేయాలని ఆయా వర్గాల ప్రజలు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ప్రభుత్వాన్ని కోరాయి.

న్యూస్ బాక్స్

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

కమాన్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా జరిగేలా చూడాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందని మంథని ఎస్‌పీడీసీఎల్ డీఈ ప్రభాకర్ అన్నారు. సోమవారం కమాన్‌పూర్‌లోని సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బకాయిలను వసూలు చేపట్టాలన్నారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ కనుకయ్య, రామగుండం ఏడీఈ రమేష్, సబ్‌స్టేషన్ ఏఈ అశోక్, సబ్ ఇంజనీర్ శ్రావణ్, లైన్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణరావు, లైన్‌మెన్‌లు ఉన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

జూలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్య భద్రతపై సంబంధిత రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తేలుకుంట గ్రామ పశువైద్యుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగులపల్లిలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు రాఘవ, రవి, యుగేందర్, మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

ఆపద సమయాల్లో పోలీసులను ఆశ్రయించాలి

సుల్తానాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినిలు ఆపద సమయాల్లో పోలీసులను ఆశ్రయించాలని షీ టీమ్ ఇన్‌చార్జి మెంబర్ స్నేహలత సూచించారు. సోమవారం గర్రెపల్లిలో షీటీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీమ్ బృందాలను ఆశ్రయించి ఆపద నుంచి రక్షణ పొందాలని సూచించారు.

ధాన్యంలో కోత విధిస్తే సమాచారం ఇవ్వండి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్/ఓదెల అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి నియోజకవర్గంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యంలో కోత విధిస్తే సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే చితకుంట విజయరమణారావు రైతులకు సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి, కోమండ్లపల్లి, నీరుకుళ్ల, గట్టేపల్లి, కదంబాపూర్, శాస్త్రినగర్, పూసాల, ఓదెల మండలం గుండ్లపల్లి, పిట్టల ఎల్లయ్యపల్లి, కనగర్తి, మడక, జీలకుంట, శానగొండ, భీమరపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు తొందరపడి ప్రయివేటు వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించవద్దని, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. దాన్య కొనుగోలు కేంద్రాల్లో గాని, మిల్లుల్లో గాని ధాన్యంలో కోత విధిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని , అలాగే కేంద్రాల్లో 41 కిలోలు మాత్రమే ధాన్యాన్ని తూకం వేయాలని అధికంగా తూకం వేసినా కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో క్వింటాలుకు పది, పన్నెండు కిలోల వరకు వడ్లు కటింగ్ చేశారన్నారు. కానీ కాంగ్రెస్ హయాంలో కటింగ్ మాటే ఉండదని స్పష్టం చేశారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకున్నాక వారికి వెంటనే రశీదులు ఇవ్వాలని, ఈ ప్రక్రియలో మిల్లర్లకు రైతులకు ఎలాంటి సంబంధం లేకుండా చూడాలని అధికారులు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, పన్నాల రాములు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఓదెల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.




కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

అంతర్గాం/పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. సోమవారం అంతర్గాం మండల పరిధిలోని మద్దిర్యాల గ్రామంలో, పాలకుర్తి మండలం వేంనూర్, కుక్కలగూడూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. రైతులకు ఈ పంట నుంచే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెండ్రు హనుమాన్‌రెడ్డి, ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేష్, మడ్డి తిరుపతి గౌడ్, సింగం కిరణ్ గౌడ్, బరుపటి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, బోడకుంట సంతోష్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడండి

పెద్దపల్లి రూరల్ , అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎన్నో సాంకేతిక మార్పులు వస్తున్నా గ్రామాల్లో చేతబడి, మూఢ నమ్మకాలు కొనసాగుతున్నాయని వాటిని విడనాడాలని సీనియర్ సివిల్ జడ్జి స్వప్నరాణి అన్నారు. సోమవారం మండలంలోని బొంపల్లి గ్రామంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి స్వప్నరాణి హజరై మాట్లాడారు. గ్రామాల్లో చదువుకోని వారు చాలా మంది ఉన్నారని , సైబర్ నేరాలు గ్రామాల్లోనే అధికమవుతున్నాయని, సైబర్ నేరాల ఉచ్చులో పడి చాలామంది నిరుపేద కుటుంబాలు మోస పోతున్నాయన్నారు. సెల్ ఫోన్‌కు ఎలాంటి మెసేజ్ వచ్చిన ఓపెన్ చేయొద్దని , ఓటిపి లను ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నారు. ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. యువత చెడు మార్గాల వైపు వెళ్తున్నారని , వారి పట్ల తల్లిదండ్రులు నిత్యం వారిని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ధరించాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు హనుమాన్ సింగ్, పంచాయతీ కార్యదర్శి సంపత్, మాజీ సర్పంచ్ అరికిల్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి స్వప్నరాణి

హామీలను నిలబెట్టుకోని రాష్ట్ర ప్రభుత్వం

సుల్తానాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికలలో ఇచ్చిన కనీస హామీలను కూడా ఈ ప్రభుత్వం అమలు చేయలేని దుస్థితిలో ఉందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయపాల్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయలకు ఇచ్చిన హామీల అమలు గురించి ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు గాను సోమవారం సంఘం ఆధ్వర్యంలో పలువురు ప్రతినిదులు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు తమ హామీలను వెంటనే అమలు చేసి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు తహసీలార్ కార్యాలయం ఎదుట అందోళన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతు ఈ ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు దాటినా ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, ఉపాధ్యాయులు,ఉద్యోగులు వారి ఖాతాల నుంచి రావలిసిన జీపీఎఫ్‌లు, మెడికల్ బిల్లులు, జీతాలకు బిల్లులు, ఏరియర్స్, ఈ కుబేర్ ద్వారా రావలిసిన అనేక పెండింగ్ బిల్లులు పేరుకపోయి ఉపాధ్యాయుల కుటుంబాలు తమ ఆవసరాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు విజేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దుగ్యాల శ్రీనివాస్ రావు, మండల అధ్యక్షులు రమేష్ బాబు, ప్రదాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, స్రవంతి, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వంటే వారికి ఉపాధి

● బంధనకల్ గ్రామస్థుల వంటలకు భలే డిమాండ్ ● మొదట ఒకరిద్దరితో ప్రారంభం ● ప్రస్తుతం 200 మందికిపైగా ఉపాధి


వంటలు చేస్తున్న యువకులు

విందు ఏదైనా బందనకల్ వంటలకు ఉన్న క్రేజే వేరు. వివాహాది శుభకార్యాలతోపాటు సభలు, సమావేశాల్లో ఆ గ్రామస్థుల వంటలకు ప్రత్యేకత గుర్తింపు. మొదట గ్రామానికి చెందిన ఒకరిద్దరు వంటలు చేస్తూ ఉపాధి పొందారు. రోజురోజుకు ఆర్డర్లు పెరగడంతో గ్రామంలోని మరికొంత మందిని జత చేసుకున్నారు. డిగ్రీలు చదువుకున్న వారి పిల్లలు కూడా ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నిస్తూనే వంటలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో 200 మంది బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో వంటలు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు.

ముస్తాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలంలోని బందనకల్ గ్రామస్థులు వంటలు చేయడంలో సిద్ధహస్తులు. వివాహాది, శుభాకార్యాలతో పాటు పార్టీల సభలు, సమావేశాల్లో వీరి వంటలకు ప్రత్యేక గుర్తింపు. 30 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన చిగురు మల్లేశం అటెండర్‌గా పని చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచిన్న సమావేశాలు, విందులకు వంటల చేసేవాడు. ఆయన చేసే వంటలు బాగుండడంతో ఆర్డర్లు రావడం పెరిగింది. దీంతో గ్రామానికి చెందిన చిగురు రాములు, రాజయ్య, మల్లయ్య నారాయణ జతకట్టారు. ఎక్కడ శుభ కార్యాలు జరిగినా మల్లేశం బృందం ఉండేది. బందనకల్ నుంచి హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లి వంటలు చేసి వచ్చేవారు. అనంతరం వారి పిల్లలు కూడా చదువుతోపాటు వంటలు చేయడం నేర్చుకున్నారు. ఓ వైపు డిగ్రీలు, పీజీలు చదువుతూ వంటల్లో ఆరి తేరారు. బృందాలుగా ఏర్పడి వంటలు చేయడం ప్రారంభించారు.

ఇలా గ్రామంలో 200 మందికిపైగా వంటలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. సాధారణ సమయాల్లో విడివిడిగా వంటలు చేసినా పెద్ద ఆర్డర్లు వచ్చిన సందర్భాల్లో వీరంతా ఒక్కటవుతారు. పది వేల మందికి అవలీలగా వంటలు చేస్తారు. విందులు, శుభాకార్యాలు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు సంబంధించిన ఆర్డర్లు ముందుగా ఇక్కడి యువతకే వస్తాయి. మాజీ సీఎం కేసీఆర్, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ నుంచి సైతం ప్రశంసలు అందుకున్నారు.

కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్న

చిగురు మధు, బంధనకల్



డిగ్రీవరకు చదువుకున్నా. చదువుకునే రోజుల్లోనే కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్నా. భవిష్యత్ సాఫీగా ఉండాలని భావించా. మా పెద్దల దగ్గర వంటలు చేయడం నేర్చుకున్నా. వందల వేల సంఖ్యలో పెద్ద పెద్ద కార్యక్రమాలు చేశాం. కేసీఆర్, సీహెచ్ విద్యా సాగర్‌రావు, కేటీఆర్ వంటి ప్రముఖులు మా వంటల రుచులు చూశారు.

ఇదో ఆదాయ వనరు

: జెల్ల నాగరాజు, బంధనకల్



పాకశాస్త్రానికి మంచి ఆదరణ ఉంది, శుభాకార్యలు ఎల్లప్పుడూ ఉంటాయి. తద్వారా వంటలకు ఆర్డర్లు లభిస్తుంటాయి. చదువులకు ఆటంకం కలుగకుండా జాగ్రత్తలు తీసుకొని వంటల్లో ప్రావీణం పొందాం. దాదాపు పది వేల మందికి పైగా అవలీలగా వంటలను రుచికరంగా అదిస్తాం.

సీనియర్ల సహకారంతో వంటలు నేర్చుకున్నా..

ప్రతాప్, బంధనకల్



సీనియర్ల సహకారంతో వంటలు నేర్చుకున్నా. ఎంబీఏ పూర్తి చేశాను. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూనే వంటలు నేర్చుకోవడానికి సీనియర్ల వెంట వెళ్లా. ప్రస్తుతానికి ఇదే వృత్తిగా మారింది. దీని ద్వారా ఉపాధి పొందుతున్నా.

పెద్దల నుంచి నేర్చుకున్నా : పండరి, బంధనకల్



డిగ్రీ వరకు చదువుకున్నాను. ఉద్యోగావకాశాల కోసం వేచి చూడకుండా మా పెద్దల వెంట వెళ్లి వంటలు నేర్చుకున్నా. ఎలాంటి వంటలైనా చేస్తాం. అతిథులు వంటలు బాగున్నాయని కితాబిస్తే సంతోషంగా ఉంటుంది.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో

దంపతుల ఆత్మహత్య

పెద్దపల్లి జిల్లా నాగారంలో ఘటన


సుజాత, శంకర్‌గౌడ్ (ఫైల్)

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని నాగారం గ్రామంలో అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో భార్య భర్తలు సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొడిగె శంకర్‌గౌడ్ (50), సుజాత (45)లు భార్యాభర్తలు. శంకర్‌గౌడ్ గీత కార్మికుడిగా, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. భార్య సుజాత పది సంవత్సరాలుగా వెన్నుపూస నొప్పితో బాధపడుతోంది. ఐదు సంవత్సరాల క్రితం ఆపరేషన్ జరిగింది. అయిన పట్టటికి నొప్పి తగ్గలేదు. ఇటీవల వైద్యులను సంప్రదించగా మళ్లీ ఆపరేషన్ చేయించాలని సూచించారు. దీంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతన్న దంపతులు మానసిక ఆందోళనకు గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సాయంత్రం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించడంతోపాటు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ముగ్గురు కూతుళ్లు ఉండగా వారికి వివాహం చేశారు.

పాఠశాల ఆవరణలో

పాముల సంచారం

- మైదానంలోని నర్సరీలో ఆవాసం
- భయాందోళనలో విద్యార్థులు


పాఠశాల ఆవరణలో పంచరిస్తున్న పాము

తంగళ్లపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పాముల సంచారంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం పాఠశాల మైదానంలో పాము కనిపించ డంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మైదానంలో పాము అటు ఇటు తిరగడంతో పరుగులు పెట్టారు. కొద్ది సేపటికి పాము వెళ్లిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. పాఠశాల ఆవరణలో నర్సరీ ఏర్పాటు చేయడంతో పాములు అందులో ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయని, తరచూ పాఠశాలలో సంచరిస్తున్నాయని విద్యార్థులు, స్థానికులు పేర్కొంటున్నారు. పాఠశాల ఆవరణ నుంచి నర్సరీని తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నర్సరీని మరోచోటుకు తరలించాలని కోరుతున్నారు.

పెన్షన్ ఇప్పిస్తానని బంగారు గొలుసు చోరీ


బాధితురాలు చంద్రకళ

జమ్మికుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ ఇప్పిస్తానని మాయా మాటలు చెప్పి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. జమ్మికుంట పట్టణానికి చెందిన సూదం చంద్రకళ ఉదయం 11గంటల సమయంలో శివాలయానికి వెళ్లేందుకు సురక్ష ఆసుపత్రి రోడ్డులో వెళుతోంది. ఆమె వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అమ్మ మీకు పెన్షన్ వస్తుందా అని అడిగాడు. లేదని ఆమె చెప్పింది. తాను ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఫొటో తీసుకోవాలి, మెడలో ఏం ఉండకూడదని అని చెప్పాడు. ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు తీసుకున్నాడు. సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి ఇక్కడే ఉండు.. ఫొటో ప్రింట్ తీసుకుని వస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయించాడు. కొద్దిసేపు వేచి చూసిన చంద్రకళ అతడు రాకపోయేసరికి మోసపోయానని గ్రహించింది. రోదిస్తూ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సహకారంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

హనుమాన్ విగ్రహం ధ్వంసం

గుర్తు తెలియని వ్యక్తుల పనే అంటూ భక్తుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న హిందూ సంఘాలు

బీర్‌పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి స్వాగత తోరణానికి కుడి వైపున ఉన్న హనుమాన్ విగ్రహం ధ్వంసం అయి పడి ఉండడంతో మండలంలోని హిందూ సంఘాల నాయకులు, హనుమాన్ భక్తులు సోమవారం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న జగిత్యాల సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని పట్టుకొని చట్టపరంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ఆలయ స్వాగత తోరణానికి కుడివైపు ఉన్న హనుమాన్ విగ్రహం ధ్వంసం చేశారని అర్చకుడు వొద్దపర్తి సంతోషాచార్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సోమవారం సాయంత్రం సుమారు 6గంటలకు బీర్‌పూర్ గ్రామానికి చెందిన అల్లెపు సిద్దార్థ్ ట్రాక్టర్ నడుపుతుండగా ట్రా క్టర్ ముందు టైరు పంక్చర్ అయి అదుపుతప్పి ప్రమాదవశాత్తు హనుమాన్ విగ్రహాన్ని ఢీకొట్టినట్లు తెలిసిందన్నారు. ఈ ప్రమాదానికి కారకుడైనా అల్లెపు సిద్దార్థ్‌ను అదుపులోనికి తీసు కొన్నట్లు తెలిపారు. ధ్వంసమైన విగ్రహం స్థలంలో మరో విగ్రహాన్ని ఏర్పాటు చేసి విగ్రహ పునఃప్రతిష్ట చేసే విధంగా ఆలయ ఈవో, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ సంఘటన కేవలం ప్రమాదవశాత్తు మాత్రమే జరిగిందని, ఈ విషయంలో ఎలాంటి పుకార్లను, తప్పుడు కథనాలను నమ్మవద్దని, సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయవద్దని పోలీసుల విజ్ఞప్తి చేశారు.

గోదావరిఖనిలో గాంధీ మార్కెట్ కూల్చివేత

కోల్‌సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెయిన్ చౌరస్తా సమీపంలోని గాంధీ మార్కెట్‌గా పిలువబడే షాపుల ను సోమవారం రామగుండం నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం కూల్చివేసింది. అదన పు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం ఉదయం ఈ కూల్చివేతలు జరిపారు. ఈ ప్రాంతంలో సింగ రేణి, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శాశ్వత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురానున్నా రని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షాపులను ఖాళీ చేయాలని ఇటీవలే టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యాపారులకు సమాచారం ఇచ్చారు. కొందరు ఖాళీ చేయగా మరికొందరు ఖాళీ చేయలేదు. సోమవారం ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్స్‌కవేటర్ తీసుకొని రావడంతో షటర్లలో వ్యాపారం నిర్వహిస్తున్న వారు హుడా విడిగా ఖాళీ చేశారు. తరువాత వాటిని నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు.

18ఏళ్ల క్రితం తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు...

రామగుండం నగరపాలక సంస్థ పోచమ్మ మైదాన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సింగరేణి సంస్థ స్థలాన్ని ఇచ్చింది. అప్పటి కూరగాయల మార్కెట్‌తో పాటు పోచమ్మ మైదాన ప్రాంతంలో ఉన్న చిన్న చిన్న దుకాణాలను అప్పటి చైర్మన్ బడికెల రాజలింగం ఆధ్వర్యంలో కూల్చి వేశారు. వారికి తాత్కాలికంగా వ్యాపారాలు చేసుకునేందుకు పునరావాసం క్రింద మున్సిపాలిటీ సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి రైతు బజార్ నిర్వహిస్తున్న స్థలాన్ని అప్పగించింది. ఆరు నెలల్లో ఖాళీ చేస్తామని మున్సిపల్ హామి ఇచ్చి స్థలాన్ని తీసుకున్నది. సుమారు 50మంది యజమానులు, కిరాయిదారులకు కేటాయించారు. పోచమ్మమైదానంలో షాపులు కోల్పోయిన వ్యాపారులు లక్ష్మీనగర్‌లో వ్యాపారాలు చేస్తున్నారు. ప్రస్తుతం గాంధీ మార్కెట్‌లో అప్పుడు షాపులు తీసుకున్న ఒకరిద్దరు వ్యాపారాలు చేస్తున్నారు. అందరు పండ్ల గోడౌన్‌లకు, ఇతర వ్యాపారాలకు కిరాయిలకు ఇచ్చారు. ఈ తాత్కాలిక మార్కెట్ స్థలంలో వ్యాపార సముదాయాన్ని నిర్మించేందుకు షాపులను తొలగించారు.

దొంగతనం కేసులో పలువురికి జైలు శిక్ష

బోయినపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరికి 17 నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి సోమవారం తీర్పు వెల్లడించినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీందర్ గౌడ్ తెలిపారు. బోయినపల్లి మండలం కొదురుపాక ఎల్లమ్మ దేవాలయంలో సంఘ ప్రణయ్, షైక్ సోహెల్ దొంగతనికి పాల్పడ్డారని కొదురుపాకకు చెందిన నాగుల నాగరాజు ఫిర్యాదుతో బోయినపల్లి పోలీస్‌లు కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి మహేందర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి సంఘ ప్రణయ్, షైక్ సోహెల్‌కు 17 నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

మరో కేసులో 18 నెలల జైలు శిక్ష

వేములవాడ టౌన్ : దొంగతనం కేసులో ఇద్దరికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి సోమవారం తీర్పు వెల్లడించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ సోమవారం తెలిపారు. వేములవాడ మండలం రుద్రవరంలోని ఎల్లమ్మ ఆలయంలో దొంగతనం జరిగినట్లు అప్పటి సర్పంచ్ 2023 ఫిబ్రవరి 7న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి వెంకట్రాజం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపు విక్రాంత్ కేసు వాధించగా న్యాయమూర్తి జ్యోతిర్మయి పూర్వపరాలను పరిశీలించి ప్రణయ్, సోహెల్‌కు 18 నెలల కారాగార జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

సిరిసిల్ల క్రైం: దొంగతనం కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. సిరిసిల్ల నెహ్రూనగర్ అంబాభవాని ఆలయంలో 27 ఫిబ్రవరి 2017 రాత్రి పూజ అనంతరం గుడికి తాళం వేసి వెళ్లిపోయారు. దొంగ గుడి గేటు తాళం పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లి మానేరు వాగులో పడేశాడు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి దొంగతనం చేసిన మానకొండూరు మండలం ఊటూరుకు చెందిన వడ్డేపల్లి సత్యం (38)ను రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం అప్పటి పోలీస్ అధికారి లియకత్ అలి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారి ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్, ఏడుగురు సాక్షులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ చెలుముల సందీప్ వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ సత్యంకు జైలు శిక్ష విధించారు.

ఇంటికి చేరే లోపే కబళించిన మృత్యువు

● రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్త, ఇద్దరు కొడుకులకు గాయాలు
● మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన


మృతిచెందిన శైలజ

మంథని, అక్టోబరు 28: తల్లిగారి ఇంటి నుంచి బయలుదేరి కొద్దిసేపట్లో తమ ఇంటికి చేరే క్రమంలో సెగ్గెం శైలజ (24) అనే వివాహితను మృత్యురూపంలో ఇసుక లారీ కబళించగా, భర్త, ఇద్దరు కొడుకులు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులోని గాడుదులగండి గుట్టపై చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం..

మండలంలోని అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన సెగ్గెం శైలజ, భర్త రాహుల్, ఇద్దరు కవలలతో కలిసి తన తల్లి గారి ఇంటికి మంచిర్యాల జిల్లా వేలాలకు వెళ్లింది. సోమవారం భర్త, పిల్లలతో కలిసి తమ ద్విచక్ర వాహనంపై అడవిసోమన్‌పల్లి గ్రామానికి బయలు దేరారు. గాడుదులగండి గుట్టపై టీఎస్ 02 డీ 8353 అనే లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. బండిపై వెనకాల కూర్చున్న శైలజ ఒక్కసారిగా కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో భర్త రాహుల్, ఇద్దరు కుమారులకు సైతం తీవ్రంగా గాయాలయ్యాయి.

సంఘటన స్థలంలో శైలజ మృతదేహం వద్ద భర్త రాహుల్ రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది. గాయపడ్డ వారిని స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గోదావరిఖనికి తరలించారు. శైలజ మృతిపై కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంథని -కాటారం ప్రధాన రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఇసుక లారీలు వేగంగా నడిపిస్తుండటంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని బైఠాయించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ రమేష్ చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం శైలజ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విలు విద్యలో రాణిస్తున్న శ్రీహన్స్‌కార్తికేయ

ఎస్ఎఫ్ఏ పోటీల్లో బంగారు పతకం కైవసం


శిక్షణ పొందుతున్న శ్రీహన్స్ కార్తికేయ

ముత్తారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టుమని పదేళ్ల కూడా లేని ఆ బాలుడు విలువిద్యలో రాణిస్తున్నాడు. ఇటీవల జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-9 విభాగంగా రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి పలువురి ప్రశంసలందుకున్నాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన లింగం శ్రీహన్స్ కార్తికేయ. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. శ్రీహన్స్ కార్తికేయ తండ్రి లింగం శ్రీనివాస్ వృత్తిరీత్యా టీచర్ కావడంతో మిత్రుల ద్వారా ఆర్చరీపై ఆసక్తి కలిగింది. దీంతో తన కొడుక్కి మొదట్లో మంథనిలో కోచింగ్ ఇప్పించాడు. కొంతకాలంగా కరీంనగర్‌లోని శ్రీకృష్ణ ఆర్చరీ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తున్నాడు. ఈక్రమంలోనే ఈ నెల 15న జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీహన్స్ కార్తికేయ పాల్గొని బంగారు పతకం సాధించాడు. రానున్న డిసెంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు సాధన చేస్తున్నాడు.



రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన శ్రీహన్స్

ఎమ్మెల్యే ఇంటి ఎదుట

దళిత బంధు లబ్ధిదారుల ధర్నా


ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

వీణవంక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి ఎదుట దళితబంధు లబ్ధిదారులు రెండో విడత నిధులు విడుదల చేయాలని సోమవారం ధర్నా నిర్వహించారు. దీంతో బీఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడించారు. దళితబంధు లబ్ధిదా రులతో కలిసి ప్రభుత్వంపై ఆందోళన చేపడతానని ఎమ్మెల్యే వారికి చెప్పడంతో వారు ధర్నాను విరమించారు.

వరుదకాలువలో గల్లంతైన వైద్యుడి మృతదేహం లభ్యం


ఉదయ్‌కిరణ్‌రెడ్డి (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం లోని విట్టంపేట గ్రామ శివారులోని వరద కాలువలో గల్లంతైన ప్రైవేటు వైద్యుడు పాకం టి ఉదయ్‌కిరణ్‌రెడ్డి (29)మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్న ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఆదివారం తన స్నేహితులతో కలిసి కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత కొడుతుండగా నీటి ప్రవాహం ఎక్కువ ఉన్న ప్రాంతంలో ఉదయ్‌కిరణ్‌రెడ్డి అందులో మునిగిపోయాడు. నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో రాత్రి గాలించినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం వరుద కాలువలో కొంత దూరంలో వైద్యుడి మృతదేహం కనిపించింది. కాలువలో నుంచి మృతదేహాన్ని పోలీసులు గ్రామస్థులతో బయటకు తీయించి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉదయ్‌కిరణ్‌రెడ్డి తండ్రి శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి స్వగ్రామమైన హనుమకొండ జిల్లా సరసపల్లి మండలంలోని వేలేరులో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

గంజాయి తరలిస్తున్న వారిపై కేసు నమోదు

ధర్మపురి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పటేల్ గార్డెన్స్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగుల మహేష్ తెలిపారు. మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన సల్లూరి రమేష్, మంచిర్యాల జిల్లా జన్నారం గ్రామానికి చెందిన జన్నోజు రాజేష్ అలియాస్ శివ కొంత కాలం నుంచి గంజాయి తాగడం కోసం అలవాటు పడ్డారని ఆయన పేర్కొన్నారు. తమ వద్ద ఉన్న గంజాయిని జల్సాలక అలవాటు పడి ఇతరులకు అమ్మేవారని ఆయన తెలిపారు. ఉదయం తమ వద్ద ఉన్న 500 గ్రాముల గంజాయిని ఇతరులకు విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

రుద్రంగి: మండల కేంద్రం శివారులోని గంగమ్మ ఆలయం వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వేములవాడ మండలానికి చెందిన నాగరాజు, జగన్‌ల వద్ద 120 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ ధర్మాబాద్‌కు చెందిన ఎండి హుస్సేన్ (28) మద్యానికి బానిసై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్ తరచూ మద్యం సేవిస్తుండేవాడు. ఆదివారం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. కుటుంబసభ్యులను మద్యానికి డబ్బులు కావాలని అడుగగా ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటి దగ్గరలోని చెట్టుకు రాత్రి సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సల్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు సత్యనారాయణపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణ జామకాయ ఇస్తానని చెప్పి బాలికను ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించగా బాలిక ఏడవడంతో ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించి అక్కడి నుంచి పంపించాడు. ఆ బాలిక ఇంటికి వచ్చి తల్లికి విషయం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

కేజీబీవీ విద్యార్థినులకు
మెరుగైన వైద్యం అందిస్తాం

మంత్రి శ్రీధర్ బాబు


విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి) కేజీబీవీలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు ఆదివారం అస్వస్థతకు గురైన విద్యార్థినులు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి వరకు విద్యార్థినులు కోలుకున్నారు. వారిలో కొందరు సోమవారం ఉదయం మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. వారిని మంత్రి డి శ్రీధర్‌బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..

ముత్తారం మండలంలోని కేజీబీవీలో విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా జిల్లా ఆసుపత్రికి 53 మందిని తరలించి 10 మంది వైద్యులు, 20 మంది స్టాఫ్ నర్సులు ఆధ్వర్యంలో అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామన్నారు. కొంత మంది బాలికలకు చలికాలంలో శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొనే మెడికల్ హిస్టరీ ఉందని, వారికి ఆసుపత్రిలో ఆక్సిజన్ అందిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారిని ఇన్‌చార్జిగా నియమించి బాలికలకు అందిస్తున్న చికిత్సను పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పామన్నారు. విద్యార్థినులు ఒకేసారి అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలను విచారిస్తున్నామన్నారు. పాఠశాలకు సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. విద్యార్థినులు క్షేమంగా ఉన్నారని, వారు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వైద్యులు, కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఆర్డీవో బి గంగయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఉన్నారు.

6

విత్తనం... వ్యవసాయానికి మూలాధారం. మేలురకం కంకులను, కాయలను భద్రపరుస్తూ విత్తనంగా వాడుకోనేవారు. ప్రస్తుతం రసాయనిక ఎరువులు, వాతావరణ కాలుష్యంతో నేలసారం తగ్గిపోతోంది. ఈనేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో దేశీయ వరి వంగడాలను రూపొందిస్తున్నారు. ఈ కోవకు చెందినవారే పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్. ఇప్పటి రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని పరిచయం చేస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నాడు.



శ్రీనివాస్ రూపొందించిన దేశీయ విత్తన రకాలు

ప్రకృతి వ్యవసాయానికి 'బీజం'

- మేలు రకం విత్తనాల ఉత్పత్తి
- సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు
- దేశవాళీ విత్తన ప్రేమికుడు ఏవో యాదగిరి శ్రీనివాస్

రామగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్ దేశవాళీ విత్తనోత్పత్తి ప్రేమికుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. వ్యవసాయంపై ఏర్పడిన మక్కువ అతడిని వ్యవసాయ విద్య వైపు మళ్లించింది. జగిత్యాలలోని పొలాసలో డిప్లొమా కోర్సు పూర్తి చేసి వ్యవసాయ విస్తరణ అధికారిగా 2011లో ఉద్యోగం సాధించాడు. 2016 నుంచి మేలు రకం విత్తనాలను సేకరించడం ప్రారంభించాడు. ఖాళీ సమయాల్లో వ్యవసాయ క్షేత్రంలో దేశీయ విధానంలో వరి సాగు చేపట్టాడు. గ్రామంలో తనకున్న రెండెకరాల్లో దేశవాళబూ విత్తనోత్పత్తి ప్రారంభించి పలువురి ప్రశంసలందుకున్నాడు. సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానం శ్రీనివాస్‌ను ఆకర్షించింది. దేశీయ వరి రకాల ఉత్పత్తికి కృషి చేసినందుకు రైతు నేస్తం ఫౌండేషన్ వారు 'ఉత్తమ రైతు' అవార్డును శ్రీనివాస్‌కు అందజేశారు. 2024 సంవత్సరానికి గాను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో 'కర్షక రత్న' అవార్డును అందుకున్నాడు. రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని రైతులకు పరిచయం చేస్తున్నాడు.. ఆదిలాబాద్ జిలాల్లో ఏవోగా పని చేసేవాడు. ఏడాది కాలంగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నాడు.


'ఉత్తమ రైతు' అవార్డు అందుకుంటున్న యాదగిరి శ్రీనివాస్



దేశవాళీ రకంతో సాగైన వరి, ట్రేలలో మొలకెత్తిన వరి

శ్రీనివాస్ ఉత్పత్తి చేస్తున్న దేశీయ వరి వంగడాలు..

- మాపిలై సాంబా, కులకార్, పుంగార్, బహూరూపి, బేళనాళ, నవారా, బర్మాబ్లాక్


దేశీయ వంగడాలతో 'ప్యాడీ ఆర్ట్'

ప్యాడీ ఆర్టిస్ట్‌గానూ..

దేశవాళీ వరి విత్తనాలతో ప్యాడీ ఆర్ట్ విధానాన్ని శ్రీనివాస్ అనుసరించారు. నల్లని వరిని వివిధ రూపాల్లో తీర్చిదిద్దడం 'ప్యాడీ ఆర్ట్'గా ప్రాచుర్యం పొందుతున్నాయి. జపాన్‌వంటి దేశాల్లో పాడీ ఆర్ట్ పేరున ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీన్ని అధ్యయనం చేసి తన పంట పొలంలో 'కాలాబట్టి' వరి విత్తనంతో గోమాత, అయోధ్య రామమందిరం ఆకారంలో సాగు చేసి శ్రీనివాస్ ప్రత్యేక తను చాటుకున్నాడు.. ఈ ఏడాది భారతదేశ పటాన్ని, 29 రాష్ట్రాలను తీర్చిదిద్దాడు.



మార్కెట్‌లో దీపావళి సందడి


ప్రమిదల కొనుగోలుతో సందడిగా మారిన మార్కెట్ రోడ్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళికి వారం రోజుల ముందు నుంచే మార్కెట్‌లో సందడి నెలకొంది. రకరకాల ప్రమిదలు, అలంకరణకు బొమ్మలు, పూజల కోసం గుమ్మడికాయలు, పూజా సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతుల్లో ప్రమిదలు అమ్మకాలకు ఉంచారు. లక్ష్మి, గణేశుడు, ఓంకారం, స్వస్తిక్, జ్యోతి, ఆకు, చేయి, నమస్కారం, కన్ను, దేవతా రూపాలు, పుష్పాల ఆకృతిలో ఉన్న ప్రమిదలే కాకుండా పలు డిజైన్లలతో తయారు చేసిన ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. ప్రమిదలు ఐదు రూపాయల నుంచి 500 వరకు ధర పలుకుతున్నాయి.

వివిధ సైజుల్లో వత్తులు, నువ్వుల నూనె అమ్ముతున్నారు. ముగ్గుల సాంచెలు 20 రూపాయలకు ఒకటి చొప్పున అమ్ముతున్నారు. పూజల్లో ఉపయోగించేందుకు గుమ్మడి కాయలకు గిరాకీ పెరిగింది. గుమ్మడి కాయలు 80 నుంచి 120 రూపాయలకు ఒకటి చొప్పున పలుకుతున్నాయి. బొమ్మలు 50 నుంచి 100 రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. ఢిల్లీ నుంచి తెచ్చిన ప్రత్యేకంగా తెచ్చి పొట్టి శ్రీరాములుచౌక్ వద్ద అమ్ముతున్న బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉత్పత్తి, దిగుమతి రేట్లు పెరగడంతో ధరలు పెంచక తప్పలేదని వ్యాపారులు అంటున్నారు. వినియోగదారులు మాత్రం ధరలు పెరిగినా కొనక తప్పడం లేదని వాపోతున్నారు. ప్రధానంగా అమ్మకాలు టవర్‌సర్కిల్, మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయం, జగిత్యాల రోడ్, శనివారం మార్కెట్, చిన్న షాపులు, ఆలయాల ప్రాంతాల్లో కొనసాగుతుండగా బండ్లు, రిక్షాల్లో పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు


వివిధ రకాల ముగ్గుల రంగులు



రేపు ధన్‌తేరాస్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకల ప్రారంభ రోజు ధన్ తేరాస్ (ధన త్రయోదశి) బుధవారం జరుపుకోనున్నారు. ఈ రోజు బంగారం కొనుగోలు చేయడం ఆచారం. దీంతో బంగారం దుకాణాలు, జువెల్లరీ షాపుల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. ఆభరణాలను స్థాయిలకు తగ్గట్టుగా కొనుగోలు చేస్తున్నారు. త్రయోదశి నుంచి 3 రోజుల వరకు లక్ష్మీదేవికి, కుబేరుడికి అభిషేక అర్చనాదులు జరుపుతారు. వస్త్ర, వ్యాపార, వాణిజ్య నిలయాలను, కార్యాలయాలను శుద్ధి చేసి రంగులు వేస్తారు. మామిడి తోరణాలు, పసుపు, కుంకుమ, పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. పూజా మందిరాలను, దేవుడి పటాలకు అలంకారాలు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు కోట్ల వరకు వ్యాపారం జరుగనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

రాజన్న ఆలయంలో
నరకచతుర్దశి ప్రత్యేక పూజలు



వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నరకచతుర్దశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ఉదయం 3.30 గంటల నుంచి 3.40 గంటల వరకు మంగళవాయిద్యములు, 3.40 గంటల నుంచి 4.20 వరకు సుప్రభాత సేవ, 4.20 నుంచి 4.30 వరకు సుప్రభాత హారతి, 4.30 నుంచి 4.40 వరకు నరక చతుర్దశి, దీపావళి పండగ సందర్భంగా మంగళహారతి నిర్వహించనున్నారు. ఉదయం 4.40 గంటల నుంచి 5 వరకు ఆలయశుద్ధి, 5 గంటల నుంచి స్వామి వారికి ప్రాతఃకాల పూజ చేపట్టనున్నారు. సాయంత్రం 4 గంటలకు నరకాసుర వధ పురాణకాలక్షేపము, 6.30 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో ధనలక్ష్మీ పూజ నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి పెద్ద సేవ చేపట్టనున్నారు.

కార్తీక మాసం పూజలు..

కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు స్వామి వారి కల్యాణ మండపంలో కార్తీక ప్రవచనము నిర్వహించనున్నారు. ప్రతీ సోమవారం స్వామి వారికి అనుబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చన నిర్వహించున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి సోమవారం, ఏకాదశి పౌర్ణమి రోజుల్లో సత్య నారాయణస్వామి వ్రతం ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు నిర్వహించనున్నారు. 13న కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు రుక్మిణి విఠలేశ్వరస్వామి వారికి పంచోపనిష ద్వారా అభిషేకం సాయంత్రం 6.35 గంటలకు శ్రీకృష్ణ తులసీ కల్యాణం నిర్వహిస్తారు. 14న కార్తీక శుద్ధ త్రయోదశి రోజున వైకుంఠ చతుర్దశి సందర్భంగా అనంతపద్మనాభ స్వామికి పంచోపనిషత్ ద్వారా అభిషేకము చేస్తారు. ఉదయం 10 గంటలకు ప్రధాన, పరివార శివాలయములలో అన్నపూజలు, సాయంత్రం 6 గంటలకు అనంతపద్మనాభ స్వామికి అభిషేకము, అనంతరం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహాపూజ, పొన్నచెట్టుసేవ ఊరేగింపు చేపట్టనున్నట్లు తెలిపారు. 15న శుక్రవారం కార్తీక పౌర్ణమి రోజున ప్రదోషకాల పూజ అనంతరం రాత్రి 7.30లకు జ్వాలా తోరణము పూజ నిర్వహించనున్నారు. రాత్రి నిశీపూజ అనంతరం రాత్రి 10.15 గంటలకు రాజరాజేశ్వరస్వామికి మహాపూజ ఉంటాయి.

1న బీసీ కమిషన్ పర్యటన

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వెనుకబడిన తరగతుల కులాల అభివృద్ధి, సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ ఈనెల 1న ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తుందని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు బీసీ కమిషన్ చైర్మన్ సమావేశమై అభిప్రాయాలను స్వీకరిస్తారని అన్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ప్రజలు హాజరై కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంచార జాతుల వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని అన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఔత్సాహికులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా బీసీ కమిషన్ బృందానికి అందించాలన్నారు. అభ్యర్థనతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్‌ను పూరించి ఆరు సెట్లను కమిషన్ సభ్యులకు అందజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం


భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకొని ఆలయ ధర్మగుండంతో పవిత్ర స్నానాలను ఆచరించారు. క్యూలో ఆలయంలోకి ప్రవేశించి పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. స్వామివారికి కోడె మొక్కును చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాడాలి

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్



సభలో ప్రసంగిస్తున్న తిరుమలై రామన్

జ్యోతినగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాటం చేయాల్సిన అవసరముందని అఖిల భారత యువజన సంఘం(ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ అన్నారు. రెండు రోజులపాటు ఎన్టీపీసీలో జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో రామన్ సోమవారం ప్రసంగించారు. నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మతోన్మాదం పెరిగిందన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ఎన్డీఏ సర్కారు ప్రైవేటు పరం చేస్తోందన్నారు. యువత కేంద్రం కుట్రలను తిప్పికొట్టి ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాలన్నారు. రెండు రోజుల వర్క్‌షాప్‌నకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యువత రావడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాద్రి, నాయకులు ధర్మేంద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన వారికి జరిమానా

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో దొరికిన వారికి హుజూరాబాద్ కోర్టు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. కేశవపట్నం పోలీసులు డ్రంకెన్ నిర్వహించగా ఐదుగురు చిక్కారు. సోమవారం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఐదుగురికి 5,500 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన సిరిసిల్ల విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో డీవైఎస్‌వో అజ్మీరా రాందాసు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన గోలి శ్రీవాత్సవ్, బూర్ల ఆశ్రిత్, ఆడెపు విగ్నేశ్వర్‌ను అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి గోలి శ్రీవాత్సవ్ రెండో సారి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీల ఎంపికకు సెలక్టర్లు ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేయగా అందులో ముగ్గురు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థులే కావడం విశేషం. బ్యాడ్మింటన్ కోచ్‌లు ఆడెపు గణేష్, హమీద్, డేవిడ్సన్, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

న్యూస్ బాక్స్

తనిఖీ నివేదికపై ప్రజావేదిక

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల కేంద్రంలో సోమవారం ఉపాధి హామీ పనులపై తనిఖీ నివేదికల ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 29 గ్రామాల్లో ఈనెల 18 నుంచి 27 వరకు గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై తనిఖీలు నిర్వహించి గ్రామ సభలు పూర్తి చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించి ఉపాధి పనులపై తనిఖీ బృందం నివేదికలు వెల్లడించారు. ప్రజా వేదికలో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన వారికి వంద రోజుల పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేష్, క్వాలిటి కంట్రోల్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఏపీవో రమేష్‌బాబు సూచించారు. సోమవారం మండలంలోని గోపయ్యపల్లిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్థిక ప్రణాళిక, చేపట్టే పనుల వివరాలపై గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో రమేష్‌బాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

సీపీఎం ఏరియా కార్యదర్శిగా రామాచారి

జ్యోతినగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రామగుండం, ఎన్టీపీసీ ఏరియా ప్రధాన కార్యదర్శిగా ఎం రామాచారిని నియమించారు. రెండు రోజులపాటు ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో జరిగిన సీపీఎం ఏరియా మహాసభలో పలు తీర్మాణాలు ఆమోదించి కొత్త కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్, ఎన్ బిక్షపతి, నాగలక్ష్మి, మల్లేశ్, తుంగపిండి మల్లేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో నాయకులు భూపాల్, వై యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు సమస్య పరిష్కరించాలి

అంతర్గాం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల అక్బర్‌నగర్ కాలనీలో గతంలో మిషన్ భగీరథ పథకం కింద ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించి నాలుగు సంవత్సరాలు గడుస్తునా నీటి సరఫరా చేయడం లేదని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కొండల రాజేందర్ కుమార్ కలెక్టర్ కోయ శ్రీహర్షను కోరారు. సోమవారం పెద్దపల్లిలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఓవర్ హెడ్ ట్యాంకు నీటి సరఫరా చేయకపోవడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. ప్రసాద్, గడ్డం సత్యం, ఎండీ అజీమ్, ఎస్ రవికుమార్, జాగెటి శాంత, మేకల సరోజ, ఆరె లక్ష్మి ఉన్నారు.

మంథనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటానికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో ఎన్‌టీపీసీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన విద్యార్థుల వైద్య శిబిరాన్ని, స్థానిక ఏఎంసీ యార్డులో, మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని చారిత్రక రామగిరి ఖిల్లాను జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటానికి, అక్కడ ఉన్న ప్రాచీన రామాలయాన్ని సైతం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఐదు కోట్లు, మంథని గోదావరినది తీరంలోని శ్రీగౌతమేశ్వర ఘాట్ అభివృద్ధికి రూ. రెండు కోట్లు, గోదావరినదిలోని మొసళ్ళ సంరక్షణ కేంద్రానికి వెళ్ళటానికి రోడ్డు నిర్మాణం కోసం రూ. రెండు కోట్లు ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. వీటితోపాటు మర్ని చర్యలు తీసుకొని మంథని ప్రాంతాన్ని ప్రముఖ



శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికత్స అందించడానికి ఎన్‌టీపీసీ సౌజన్యం రోహిణి ఫౌండేషన్‌వారు కృషి చేస్తుండటం అభినందనీయమన్నారు. ఆరుగాల కష్టపడి పంటలు పండించిన రైతులను ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రాకుండా చూడాలని మిల్లర్లకు సూచించారు. మిల్లర్ల సమస్యలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం పరిష్కరించడానికి కృషి చేస్తుందన్నారు. నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని దీపావళి పండగ రోజు ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పర్యాటక శాఖ కమిషనర్ ప్రకాష్‌రెడ్డి, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఎన్‌టీపీసీ ఈడీ కేదర్ రాజన్ పాండు సహకార శాఖ అసిస్టెంట్ రిజిష్టర్ నరేష్, శశిభూష ణ్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, ఐలి ప్రసాద్ పాల్గొన్నారు.

ఏకో పార్క్ పనులకు శంకుస్థాపన

రామగిరి (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియా ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ సమీపంలో తొమ్మిది హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 3 కోట్ల 56 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఎకో పార్క్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం జీఎం కార్యాలయంలో మహిళా ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రెచ్ (శిశు సంరక్షణ కేంద్రం) భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్జీ-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ పాల్గొన్నారు.

'రుడా' ఏర్పాటుపై అసంతృప్తి

(5వ పేజీ తరువాయి)

అనుమతులు ఇవ్వనున్నారు. గతంలో 900 చదరపు గజాలకు పైగా స్థలంలో జరిపే నిర్మాణాలన్నింటికీ రుడా ద్వారానే అనుమతులు ఇచ్చే వాళ్లు. ఇప్పుడు ఆ విస్తీర్ణాన్ని తగ్గించనున్నారనే చర్చ జరుగుతున్నది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఎక్కువ గ్రామాలకు విస్తరించడం వల్ల స్థానిక సంస్థలకు ఆదాయం తగ్గి నిర్వీర్యం కానున్నాయని, గ్రామీణ ప్రజలపై పన్నుల భారం పడనున్నదని పలువురు అంటున్నారు. ఇప్పటికే జిల్లా, మండల పరిషత్‌లకు నిధులు, విధులు లేక పూర్తిగా నిర్వీర్యమై గతి తప్పాయి. కేవలం రాజకీయంగా పలువురికి పదవుల కోసమే మండల, జిల్లా పరిషత్‌లు ఉన్నాయని, ఆ పదవులు కూడా అలంకారప్రాయమేనని అంటున్నారు. భవిష్యత్‌లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు అధికారాలను పెంచితే మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిస్థితి కూడా అగమ్యగోచరమేనని పలువురు చర్చించుకుంటున్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో ఓపెన్ హౌస్

కోల్‌సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాస్ ప్రారంభించారు. సింగరేణి మెడికల్ కళాశాల విద్యార్థులు, గోదావరిఖని పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిషనర్ శ్రీనివాస్ స్వయంగా పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాలు, ఏకే47, ఎస్ఎల్ఆర్, కార్బన్, 9ఎంఎం పిస్టల్ గురించి వివరించారు. ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్ సామాగ్రి, వాటి పనితీరు, స్పీడ్ లేజర్ గన్స్ గురించి వివరించారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు సంబంధించి పరీక్షించే కిట్లు, డాగ్ స్క్వాడ్, సైబర్ క్రైమ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధన లు, ట్రాఫిక్ నిబంధనల గురించి తెలుసుకోవాలని, ప్రమాదాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ దామోదర్, సంపత్, మల్లేషం పాల్గొన్నారు.

రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న సీపీ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రక్త దానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల (ఫ్లాగ్ డే) సందర్భంగా పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వారి సహకారంతో పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సీపీ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అమరవీర జవానులను స్మరించుకుంటూ రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. రక్తదానం చేయడానికి అందరూ ముందుకు రావాలని ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసే ప్రాణ దాతలుగా నిలువాలని సూచించారు. శిబిరంలో పోలీసులతో పాటు స్థానిక యువత 400 మంది పాల్గొని ఉత్సాహంగా రక్తదానం చేయడానికి రావడం అభినందనీయమన్నారు. సీపీ రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఎస్ఐలు సిబ్బంది, లయన్స్‌క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి



పెద్దపల్లిలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో అమలు చేస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటియూ అనుబంధ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవిందర్ అన్నారు. సోమవా రం పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపెల్లి రవిందర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో అమలు చేస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మామిడి పల్లి తిరుపతి, బందరి అశోక్, ముస్తాఫ, రాజేశం, తిరుపతి కార్మికులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్(ఆంధ్రజ్యోతి): జీపీ ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు పెంచి రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో రామ్మోహనచారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. జీపీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 5, 6తేదీల్లో దీక్షలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మంద రాజేందర్, సీఐటీయూ మండల అధ్యక్షుడు అంబాల లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతి కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక నాయకులు ఆసంపెల్లి బానయ్య, వైద్య సంపత్, ఎండీ అఫ్సర్, వేల్పుల బాస్కర్, తకాయి, నర్సింగం, బెనర్జి పాల్గొన్నారు.

విద్యుత్‌వైర్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

జూలపల్లి, అక్టోబరు 28:(ఆంధ్రజ్యోతి) మండలంలోని వడుకాపూర్ గ్రామ శివారులోని ఉస్సేమినియావాగు పరివాహక ప్రాంతంలోని వ్యవసాయ మోటర్లు, వైర్లను కొద్ది రోజులుగా గుర్తు తెలియని దుండగులు చోరీ చేస్తున్నారని వడుకాపూర్ గ్రామానికి చెందిన కన్నం రాయలింగు అనే బాధిత రైతు స్థానిక మండల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సోమవారం తెలిపాడు. ఆరుగాలం కష్టపడి పంటలు చేతికి వచ్చే క్రమంలో రైతులకు చెందిన విద్యుత్ మోటర్లు, వైర్లను రాత్రివేళలో చోరీచేస్తున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు రాయలింగు తెలిపాడు. విద్యుత్‌మోటర్లను, వైర్లను చోరికి పాల్పడుతున్న వ్యక్తులను వెంటనే గుర్తించి వారిపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరాడు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముత్తారం అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోడ ప్రకాష్ రెడ్డి భార్య ఇటీవల మరణించగా కుటుంబసభ్యులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, ముత్తారం మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ సోమవారం పరామర్శించారు. వారి వెంట యువజన కాంగ్రెస్ మండల అధక్షుడు బక్కతట్ల వినీత్, గ్రామశాఖ అధ్యక్షుడు చేణవేన శ్రీనివాస్, చెనవేణ సాయికుమార్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా అందించడం అభినందనీయం

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం సభ్యులకు ప్రమాద భీమా బాండ్లు అందించ డం అభినందనీయమని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. సోమవారం ధర్మారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తన్నీరు రాజేందర్‌తో పాటు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారో త్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ హాజరయ్యారు. అంతకుముందు మండలంలోని అన్ని గ్రామాల నుండి తరలివచ్చిన మున్నూరు కాపులు స్థానిక పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా గౌతమ బుద్ధ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌతమ బుద్ధ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో దేవయ్య పటేల్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా ధర్మా రం మండలంలోని సభ్యత్వం స్వీకరించిన ప్రతి ఒక్కరికి రెండున్నర లక్షల రూపాయల విలువ చేసే ఇన్సూరెన్స్ బాండ్లు వ్యక్తిగతంగా అందించడం గొప్ప విషయమన్నారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు సోమారపు అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మల్కా రామ స్వామి మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జీవిఆర్, బాదినేని రాజేందర్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు బండి సంజీవ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏలువాక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల చెల్లింపు, పెండింగ్ డీఏలు చెల్లింపు, పీఆర్‌సీ అమలు వంటి సమస్యలపై తపస్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మండల తహసీల్దార్ మహ్మద్ ఆరీఫోద్దిన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు నూతి మల్లయ్య మాట్లాడుతూ ఐదు డిఏలు పెండింగ్‌లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒకటి మాత్రమే ప్రకటిం చడం చాలా అన్యాయమన్నారు. వేతనాలపై ఆధారపడి జీవించే ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన డీఏల కోసం ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి మిగతా పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ ధర్మారం మండల నాయకులు గడ్డం దశరధ రెడ్డి, అంజన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం



విజిలెన్స్ ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్టీపీసీ సిబ్బంది

జ్యోతినగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీలో సోమవారం విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులతో విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించారు. వారం రోజులపాటుప్రాజెక్టులో విజిలెన్స్‌కు సంబంధించి ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికులు, సీఐఎస్ఎఫ్ సిబ్బందికి వివిధ పోటీలు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తారు.



ఆర్జీ-2లో విజిలెన్స్ వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం కార్యాలయ ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో సోమవారం విజిలెన్స్ వారో త్సవాలు ప్రారంభమయ్యాయి. జీఎం కార్యాలయంలో జీఎం సూర్యనారాయణ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్టోబరు 28 నుండి నవంబరు 3 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్టు జీఎం తెలిపారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడారు. సింగరేణిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఏటా విజిలెన్స్ వారోత్సవాలు జరుపుకుంటున్నట్టు తెలిపారు. ఈ ఏడాది సమగ్రత సంస్కృతి దేశ పురోభివృద్ధి అనే నినాదంతో విజిలెన్ వారోత్సవాలు జరగనున్నట్టు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు.

సింగరేణిలో బొగ్గు రవాణా, వెహికిల్ ట్రాకింగ్ సిస్టం, విడిభాగాలు, వస్తువుల కొనుగోళ్లలో ఆన్‌లైన్ బుకింగ్ వంటి ఆధునిక సాంకేతిక విధానం ద్వారా అవకతవకలకు అవకాశం లేకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్టు జీఎం అన్నారు. వివిధ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పరీక్షల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యంత పకడ్బందీగా నిర్వహించి, అదే రోజు ఫలితాలను ప్రకటించడం కేవలం సింగరేణిలో జరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఉద్యోగులు నిబద్ధతతో, నిజాయితీతో పనిచేసి అవినీతి రహిత సింగరేణి తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జీఎం సూర్యనారాయణ సూచించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, ఆఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్, డీజీఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, అధికారులు పండరీనాథ్, షరీఫ్ మహమ్మద్, వేణుగోపాల్, వినయ్‌సాగర్, ప్రతాపగిరి రాజుతో పాటు జీఎం ఆఫీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రామగిరి(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో ఈ నెల 28నుంచి నవంబర్ 3 వరకు నిర్వహించనున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం జీఎం కార్యాలయంలో ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిలుగా హాజరై వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, రఘుపతి, సత్యనారాయణ, శ్రీనివాసులు, చంద్రశేఖర్, రాజారెడ్డి, సుధాకర్, గుర్రం శ్రీహరి, ఐలయ్య, రాజేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ప్రధాని మోదీ ఆదర్శం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలకు ఆదర్శం ప్రధాని నరేంద్ర మోదీ అని, అసెంబ్లీ ప్రవాసి ప్రముఖ్ గొట్టె ముక్కుల సురేష్ రెడ్డి అన్నారు బీజేపీ సభ్యత్వ అభియాన్ స్పెషల్ డ్రైవ్లో భాగంగా సోమవారం అడ్డగుంటపల్లి, కాకతీయనగర్, గంగానగర్‌లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వగురువుగా పేరుపొందిన నరేంద్రమోదీ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఇతర దేశాలకు వ్యాక్సిన్ అందించి అక్కడ కూడా ప్రాణనష్టం జరుగకుండా చూశారన్నారు. హిందువుల ఆరాధ్య దైవమైన అయోధ్యలో బాలరాముని ఆలయం నిర్మించి ప్రజల్లో చెరగని ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ కన్వీనర్ వెంకటరమణ, నాయకులు కోడూరి రమేష్, మహావాది రామన్న, గోపగోని నవీన్, శ్వేత, స్వరూప, విష్ణువర్ధన్‌రెడ్డి, మురళీ పాల్గొన్నారు.

జ్యోతినగర్: బీజేపీపై ప్రజల్లో విశేష ఆదరణ ఉందని, మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ సర్కారు విధానాలకు అన్నివర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని సభ్యత్వ నమోదు ప్రవాసి ప్రముఖ్ గొట్టెముక్కల సురేష్ పేర్కొన్నారు. బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన నియోజవకర్గంలోని ఎన్టీపీసీ పీటీఎస్‌లో పార్టీ సభ్యత్వ నవెదు కార్యక్రమంలో సురేష్ మాట్లాడారు. బీజేపీ దేశంలోనే మహాశక్తిగా రూపొందిందని, పార్టీ బలోపేతానికి ప్రతీకార్యకర్త కృషిచేయాలని కోరారు. పార్టీపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని పార్టీ శ్రేణులు గుర్తించి వారి బాగోగులు చూడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో క్యాతం వెంకటరమణ, రామన్న, బాలు, ఓదెలు, సుమంత్, శ్రావణ్, సంతోష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కార్తీక జ్యోతితో నగర సంకీర్తన

సుల్తానాబాద్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంను పురస్కరించుకుని సుల్తానాబాద్‌లో కార్తీక జ్యోతితో నగర సంకీర్తన చేశారు.

ప్రతీ ఆశ్వీయుజ మాసంలో వచ్చే కోజాగరి పౌర్ణమి రోజున అర్ధరాత్రి పాలు, పాయసం లో చంద్రుని దర్శనం చేసుకుని కార్తీక జ్యోతితో పూజలు ఆరంభిస్తారు. ఇలా కార్తీక జ్యోతితో సోమవారం నగర సంకీర్తన చేశారు. ముప్పై రోజుల పాటు వేణుగోపాల స్వామి ఆలయం ఆవరణలో ఉన్న భవానీ సాంబశివ ఆలయం నుంచి జ్యోతి బయలుదేరి పాత జెండా మీదుగా పాత బజారులోని శివాలయం, హన్‌మాన్ టెంపుల్ వరకు వరకు వెళ్లి మల్లీ వేణుగోపాల స్వామి ఆలయం చేరుకుంటుంది.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్, ఆక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్మిక రంగానికి, కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అనేక పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఈపీఎఫ్ అధికారులు, జిల్లా నోడల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏనుగు మోహన్‌రెడ్డి, డీకే రావు సూచించారు. సోమవారం స్థానిక రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం భవనంలో రైస్ మిల్లర్లతో కార్మికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతు ప్రభుత్వాలు కార్మికులకు వారి కుటుంబాలకు, వారి సంక్షేమానికి అమలుచేస్తున్న పథకాల గురించి వివరిస్తూ వాటిని ఎలా ఎప్పుడు పొందాలో వివరించారు. ప్రతీ కార్మికుడు ఈపీఎఫ్, ఈఎస్ఐ కలిగి ఉండాలని తద్వారా భవిష్యత్తులో కార్మికులకు ఒనగూరే ప్రయోజనాల గురించి వివరించారు. సమావేశంలో మండల, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు పురుషోత్తంరావు, తిరుపతిరెడ్డి, సంఘ బాధ్యులు విజయ్‌పాల్‌రెడ్డి, మినుపాల ప్రకాశ్‌రావు, రాములు, శ్రీకాంత్, పల్లా వాసు పాల్గొన్నారు.

సెంటినరీకాలనీ పోస్టాఫీస్‌లో ఘరానా మోసం?

రామగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీ పోస్టాఫీస్‌లో మోసం జరిగినట్టు సమాచారం. సెంటినరీకాలనీ పోస్ట్ ఆఫీస్‌లో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్న నరేంద్రచారి ఖాతాదారులు చేసిన డిపాజిట్ మొత్తాన్ని నకిలీ పాస్‌బుక్‌లతో తన సొంతానికి వాడుకున్నాడని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. కాగా ఇటీవల మండలంలోని బేగంపేట్‌లో సైతం నకిలీపాస్ పుస్తకాలతో ఖాతాదారులను మోసం చేశారనే విషయం బయటపడింది. కాగా బేగంపేట్ కంటే ముందే సెంటినరీకాలనీలో జరిగిన అవకతవకలు ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ గోప్యంగా ఉంచి విషయం బయటకు రాకుండా బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌ను వేరే చోటుకు బదిలీ చేసినట్టు సమాచారం. తమ డబ్బులను నకిలీ అకౌంట్లతో కాజేశారని, పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

చిరు వ్యాపారులకు సమన్యాయం జరిగేలా చూడాలి

రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధి, సుందరీకరణ పేరుతో చిరు వ్యాపారుల ఇబ్బంది పెడుతుందని, సమన్యాయం జరిగేలా చూడాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హెచ్చరించారు. సోమవారం గోదావరిఖని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిఖని పట్టణంలోని హనుమాన్‌నగర్, శివాజీనగర్, గాంధీనగర్, ఓల్డ్ అశోక్ టాకిస్, తదితర ఏరియాల్లో చిరు వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న వ్యాపారులకు ముందస్తు సమాచారం లేకుండా, వారికి ఎలాంటి సమయం ఇవ్వకుండా దౌర్జన్యంగా వారి దుకాణాలను కూల్చడంతో వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారని, భయ భ్రాంతులకు గురైతున్నారన్నారు. చిరు వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా వారి దుకాణం కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మేం గెలిస్తే మార్పు తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక చిరు వ్యాపారుల దుకాణాలు కుల్చడం, వారిని రోడ్డున పడేయాడమేనా మీరు తెచ్చిన మార్పు అని ప్రశ్నించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు పాముకుంట్ల భాస్కర్, బాదె అంజలి, నాయకులు అచ్చే వేణు, నారాయణదాసు మారుతి, చల్లగురుగుల మొగిళి, చెలకలపల్లి శ్రీనివాస్, ఆడప శ్రీనివాస్, సట్టు శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావణ్, మహేందర్, శేషగిరి, వెంకన్న, చింటు, నిట్టూరి రాజు, నీరటి శ్రీనివాస్, రాజ్ కుమార్, మహేందర్ పాల్గొన్నారు.



ఎన్టీపీసీలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

సమస్యల పరిష్కారంపై ఎన్టీపీసీలో ధర్నాకు యత్నం

జ్యోతినగర్: ఎన్టీపీసీ పునరావాస కాలనీ సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్షం చేస్తోందని ఆరోపిస్తూ మాజీ ఎ మ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ధర్నా, వంటావార్పును పోలీసులు భగ్నం చేశారు. పునరావాస ప్రాంతాలతో పాటు భూనిర్వాసితులను పట్టించుకోవడం లేదని కొన్ని నెలలుగా బీఆర్ఎస్ శ్రేణులు, ఆయా కాలనీల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ప్రాజెక్టు ప్రధాన గేటు వద్ద వంటావార్పు ధర్నాకు ఉపక్రమించారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నాయకత్వంలో డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, బీఆర్ఎస్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు మేడిపల్లి సెంటరు నుంచి ర్యాలీగా ఎన్టీపీసీ ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, సీఎస్ఆర్ నిధులు పునరావాస కాలనీ అభివృద్ధికి వినియోగించాలని మాజీ ఎమ్మెల్యే చందర్ డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా ధర్నా చేయవద్దని, ప్రాజెక్టు ఏరియా నుంచి వెళ్లిపోవాలని రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ వెంకట్ బీఆర్ఎస్ నాయకులకు చెప్పారు. అయితే తాము ఎన్టీపీసీ అధికారులతో మాట్లాడుతామని, వారిని రప్పించాలని చందర్ పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు మాజీ ఎమ్మెల్యే చందర్, 20 మంది బీఆర్ఎస్ శ్రేణులను ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు.